# విలువలు

● సింహప్రసాద్

అదాక పెద్దపేట బస్సు రూటు. బస్‌స్టాండులో రంగరాజుగారి బస్సు నిలబడి వుంది. ఉదయం ఆరు గంటలకే లెక్కప్రకారం బయలుదేరాలి గాని, ఆరున్నరవుతున్నా బయలుదేరలేదు. ఇంకో పది నిమిషాల్లో బయలుదేరే సూచనలు కూడా లేవు.

ఆ బస్సు ఆ రూట్లోని మిగిలిన బస్సుల్లా గాక ఎర్రగా వుంటుంది. డోర్, వుండదు. 5' 4" ఎత్తు దాటినవాళ్ళంతా తల లొంచుకోవాల్సిందే. బస్సు నిండా దెబ్బలకీ, సొట్టలకీ లోటులేదు. అది నడుస్తూంటే పెద్ద పెద్ద ధం ధం శబ్దాలొస్తాయ్. మొత్తానికి అది చూడగానే డొక్కుబస్సు అన్పిస్తుంది. అంతేకాదు— ఎర్ర బస్సంటే చాలు, అది రంగరావు గారి బస్సనీ, స్లోగా, పెద్ద గొడవచేస్తూ వెళుతుందనీ, జనాన్ని కూరేస్తారనీ, ఎప్పుడూ అలస్యంగా వస్తుందనీ ఆ ప్రాంతం వారందరకీ తెలుసు. ఆ బస్సు కూడా ఎప్పుడూ ఆ లక్షణాల్ని అతిక్రమించలేదు.

రంగరాజుగారి బస్సు ప్రతిసారీ ఆలస్యంగా బయలుదేరుతోంది గనుక ఆ తర్వాతి ట్రిప్పువారికి కొద్దో గొప్పో నష్టం వస్తూంటుంది. అందుకు మిగిలిన వాళ్ళు కొంచెం కోప్పడుతూంటారు కాని గట్టిగా అడగలేరు. కారణం రంగరాజుగారికి కాస్తో కూస్తో పొలిటికల్ ఇన్‌ఫ్లూయన్స్ వుందని భయం. దానికి తోడు రంగరాజుగా రబ్బాయిలూ వాళ్లూ ఫలానా మంత్రిగారు తమకు బాగా దగ్గర బంధువులని చెప్పి బ్రేక్ ఇనస్పెక్టరునుండి అందర్నీ బెదిరిస్తూండటంకూడా కద్దు,

ఎర్ర బస్సుకిద్దరు డ్రైవర్లున్నారు. గాని క్రితంరాత్రి ఒక డ్రైవరుకీ రంగరాజుగా రబ్బాయి రామరాజుకీ మాటా మాటా రావటంతో అతడ్ని తీసేసి కాళీగా వుంటున్న తనే బస్సు నడపడానికి నిశ్చయించుకున్నాడు రామరాజు. అత డిదివరకూ అప్పుడప్పుడూ బస్సు నడిపినవాడవటంతో రంగరాజుగారేమీ అభ్యంతర పెట్టలేదు.

ప్రస్తుతం రామరాజు బస్‌స్టేండ్ ప్రక్కనేవున్న సాయిబు కొట్లో తాయితీగా కూర్చొని టీ త్రాగుతున్నాడు. కండక్టరొచ్చి "స్టార్టవుదా మా సార్"

అన్నాడు.

"ఇంకో పావుగంటుందాం. ఇంకా పాసెంజర్సు రావొచ్చు,"

కండక్టరుకూడా అక్కడే చతికిల బడ్డాడు,

ఎర్రబస్సులోవున్న పదిమందీ ఎంత సేపటికీ బస్సు కదలకపోయేసరికి చిరాకు పడుతున్నారు తమలోతామే.

"ఈ బస్సెప్పుడూ ఇంతే" ఒకాయన విసుక్కున్నాడు.

"ఓలమ్మో! టీనీళ్ళు తాగొత్తనంటే బస్సెల్లి పోద్దన్నాడా బాబు. ఎండసురుక్కు మంటున్నా కదల్లవేం లేదు" ఒక ముసలావిడ గొణిగింది.

ఒకాయన బస్సులూ, రైళ్ళూఆలస్యం గురించి చిన్న లెక్చరివ్వసాగాడు. కొందరు విసుక్కున్నా ఎక్కువమంది వినసాగారు.

ఏడుగంటలవుతూండగా రామరాజు బస్సెక్కి అవాళ్టినుంచి - ఆ ట్రిప్పు నుండి ఓ డ్రైవరుగా తాను బస్సు నడప బోతున్నాడు గనుక రోజులా అరటిపళ్ళు గాక కొబ్బరికాయకొట్టి అద్దాల కేసులో బిగించబడ్డ వెంకటేశ్వరస్వామి, అలివేలుమంగ, లక్ష్మి, వినాయక, ఆంజనేయ సాయిబాబాలకు చూపెట్టి అగరొత్తు వెలిగించి దణ్ణం పెట్టుకుని బస్సు స్టార్టు చేశాడు.

. "హమ్మయ్య! ఎప్పటికెళ్ళినా అసలంటూ వాహనం కదిలింది." ఒకాయనన్నాడు.

కొంతదూరం వెళ్ళేక సడన్ బ్రేకు వేయడంతో బస్సులోని అందర్నీ కుదిపేసి ఆగింది. ఎర్రబస్సు.

ఏవిటేవిటన్నారంతా.

"ఏంలేదు పందిపిల్ల" రామరాజన్నాడు ఏదో మామూలు విషయంలా.

"చచ్చిందా ?" కండక్టర్ ఆతృతగా అడిగాడు.

"మాటాడకుండా చచ్చింది. పంది పిల్ల బస్సుక్రింద పడటం మంచిదే. ఇంకానయం తొలుగుండగా ఏ కుక్కపిల్లో పడలేదు."

రామరాజు మామూలుగానే వున్నాడు కాని కండక్టర్ అదిరి పోతున్నాడు. అసలే ఆ ఊరు మంచిదికాదు. ఇదివరకోసారిలాగే ఓ కోడి బస్సుక్రింద పడి చస్తే యాభై రూపాయలిస్తేగానీ బస్సు కదలనివ్వమని ఇచ్చిందాకా కదలనివ్వలేదీ ఊరివాళ్ళు. అనుకుంటూ ఎవరైనా వస్తున్నారేమోనని బయటికి చూశాడు కండక్టర్.

ఓ కుర్రాదెళ్ళి ప్రక్క గుడిసెల్లో చెప్పినట్లున్నాడు ఒకామె ఏడుస్తు పరుగెత్తుకొచ్చి పచ్చడైన పంది పిల్లని చూసి "బంగారం నాంటి పిల్ల....అని గట్టిగా ఏడ్వసాగింది.

"కండక్టరూ పది రూపాయలు పారెయ్. మన తప్పేం లేదసలు. ఆ పంది పిల్లసలే కుంటిది"రామరాజన్నాడు.

"కుంటిదికాదు బావూ" ఆ ఏడుస్తున్నామె అంది.

"అంతకు ముందెక్కడో దెబ్బ తగిలి ఉంటుంది .. నేను స్పష్టంగా చూశా-కుంటిదే" బుకాయించాడు రామరాజు.

ఆమె మరి మాట్లాడలేదు. ఏడుస్తూనే డబ్బు లందుకుంది. ఇంకా ఎవర్రాకుం

దానే వెళ్ళిపోవడం మంచిదని బస్సెక్కు తూనే రైటు చెప్పాడు కండక్టర్.

బస్సు కదిలింది.

ఆ విషయమై, అలాటి సంఘటనల విషయమై చెప్పుకో సాగారంతా.

బస్సు అయిదా రూళ్ళు దాటేసింది.

యిక్కడ రోడ్డు మలుపు తిరుగుతుంది ఇరుగ్గా కూడా వుంటుంది. చాలా జాగ్రత్తగా తిప్పాలి. బస్సయితే అక్కడ రామ రాజసలే కొంచెం రేష్మనిషేమో, పైగా ఆ ఊరతడి అత్తవారి ఊరేమో ఒకరకమైన స్టయిల్‌కూడా కలిసికొంచెం ఇదిగానే తిప్పాడు బస్సుని. దాంతో బస్సు ఆ ప్రక్కనున్న రాయికి గుద్దేయబోయింది. ఇంకో ప్రక్కకు తిప్పాడు —

అంతే—

ఆ ప్రక్క సందులోంచి రోడ్డుమీదకు పరుగెత్తుకొచ్చిన ఓ కుర్రాడిని గుద్దేసింది—

బ్రేకులు వేసినా పడలేదు. కొంచెం పైకెళ్ళక బస్సాగింది.

బస్సులోని వాళ్ళంతా కంగారుగా దిగి భ్రమాన్పడి పోయారు. ఆ చుట్టుపక్కల వాళ్ళూ అదే స్థితిలో వున్నారు.

ఆ కుర్రవాడు కొంచెంసేపు కొట్టుకుని ప్రాణం వదిలాడు.

అతడి రక్తం చిమ్మి అక్కడి రోడ్డునంతా ఎర్రగా కళ్ళు తిరిగేలా చేసేసింది.

ఆ కుర్రాడు ఒక్క నిక్కరుతో ఒళ్ళంతా మట్టితో వుండటంవల్ల తల చిట్లడం వల్ల అతడెవరయ్యిందీ ఆ ఊరివాళ్ళు కూడా గుర్తించ లేక పోయారు.

"నాదేం తప్పులేదండీ వాడే వచ్చి పడ్డాడు. పడాలని పడ్డాడేమో కూడా, అయినా మా బస్సు క్రింద పడ్డాడు. కనుక ఏదో ఇస్తాం లెండి. మాలవాళ్ళబ్బాయనుకుంటా— ఓ రెండొందలు పారేస్తే సరి. అసలా ప్రాణానికి ఆ మాత్రం కూడా దండుగ. అలా అని మా మావగారితో చెప్పవోయ్, అంతగా వాళ్ళింకా నిక్కి నీల్గితే ఎదురు పోలీసు కేసు పెడతామని, ఓ మంత్రిగారు కూడా మా చేతిలోనే వున్నాడని చెబితే సరి మారు మాట్లాడరు" నిర్లక్ష్యంగా ఎరిగిన ఒకాయనతో అన్నాడు రామరాజు —

అక్కడున్న ప్రేక్షకులు అతడిదే అన్యాయం అని లోపలనుకుంటున్నా పైకేమీ అనలేదు. అతడా ఊరి మునసబుగారి అల్లుడు మరి!

"మా మావగారు చూస్తార్లే—పదండి" అని బస్సెక్కి స్టార్ట్ చేశాడు రామరాజు.

ఇందాక పందిపిల్ల మీంచి బస్సెళ్ళినప్పట్నుండి ఇంకా తాము దిగాల్సిన ఊరు రాక బస్సులోనే వున్న వాళ్లు ఈయన బస్సుని దేనికో గుద్దించి అందర్నీ చంపిపారేస్తాడనుకుని బస్సుదిగిపోయారు. తర్వాతి బస్సులో వెళ్ళొచ్చులే అని.

కండక్టర్‌కీ వణకూ దడగానే వుంది గొడవేమవుతుందో అని అటు తిరిగి ఇటు తిరిగి ఆ గొడవ (ఒకవేళ కేసైతే మాట) తన మీదకు త్రోసేస్తే....అని భయపడిపోతున్నా డతడు.

బస్సులోని వాళ్ళంతా ఊపిరి బిగబట్టుకుని నిశ్శబ్దంగా కూర్చున్నారు.

బస్సు గమ్యం చేరింది.




"అబ్బయ్య" అనుకున్నారంతా బస్సు దిగుతూ. బస్సుదిగి అక్కడున్న వాళ్ళకి. జరిగిన దుర్ఘటన గురించి సవిస్తరంగా చెప్పి మరీ వెళ్ళారు.

రామరాజుకి చిరాగ్గానే వుంది. దగ్గర్లోని బ్రాందీ షాపుకెళ్ళి ఓ అరబాటిల్ త్రాగి స్థిమితంగా కూర్చున్నాడు.

బస్సు తిరిగి స్టార్టవ్వాల్సిన టైమూ, తామేళ్ళ ఆలస్యంతో కూడిన టైమూ కూడా అయిపోయింది. కాని బస్సు కదలలేదు.

కండక్టరెళ్ళి పిలిచాడు.

"వస్తున్నా" అని పావుగంటకొచ్చాడు రామరాజు.

అంతలో తర్వాత ఆ బస్సొచ్చింది.

"ఇంత లేటా ?" అని వాళ్ళు కేకలేస్తారని కండక్టరు జడిశాడు కాని వాళ్ళు మీ రామరాజుగారికోసం చూస్తున్నారు. త్వరగా వెళ్ళండి" అన్నారు కండక్టరుతో.

వారి మొఖాల్లో స్పష్టంగా కనిపిస్తోన్న ఆందోళనకి మరీ బెదిరిపోయాడు కండక్టరు అయితే ఆ ఊరివాళ్ళంతా కర్రలతో....అని ఇదైపోతున్నాడతడు.

ఆ మాటలు విన్న రామరాజుకి రోషం వచ్చింది. "వెధవ నాయాళ్ళు-నా కోసం చూస్తున్నారా ? చూస్తానుండండెహె వీళ్ళ తడాఖా" అని బస్సెక్కాడతడు.

రామరాజుకు త్రాగుడలవాటు గనుక అతడు త్రాగిన బ్రాందీకి గాక అతడ్నావరించిన కోపం కండక్టర్ని భయపెట్టింది. ఈ వేడిలో స్పీడుగా తోలి దేనికైనా గుద్దేస్తే....అనుకొని ఎటునుంచేం జరిగినా మంచిదని బస్సు మధ్యలో

కూర్చున్నాడతడు.

బస్సు దూసుకుపోతోంది.

ఈ బస్సెక్కకుండా వుండాల్సిందను కొంటూ భయపడుతున్నారు బస్సులో వాళ్ళు.

ఎవరైనా దిగాల్సొచ్చినా ఎక్కాల్సొచ్చినా త్వరగా త్వరగా అని కేకలేసి త్వరగా తోలుతున్నాడు రామరాజు.

బస్సు రామరాజు మావగారి ఊరు చేరింది. ఇందాక యాక్సిడెంట్ జరిగిన చోట బస్సాపి బయటకు దూకి "ఎవడ్రా నాది తప్పనేది?అణాకానీ ప్రాణానికి ...." అంటూ రంకెలేస్తున్న వాడల్లా, అక్కడెవరూ అడగడాని కొచ్చిన వాళ్ళు లేకపోవడంతో రామరా జాగిపోయాడు. తనకోసం చూస్తున్నారన్నా రెవరూ లేరే?

రామరాజు పెద బావమర్దివచ్చి "మా ట్రాక్టరు డ్రైవరు బస్సెక్కుతాడు. ఇది వరకు బస్సుతోలినోడే," అని కండక్టరుతో చెప్పి "రా బావా ఇంటికి వెళ్దాం" అన్నాడు రామరాజుతో.

మావగా రింటివద్ద ఆ కుర్రాడి తరపు వాళ్ళున్నారన్న మాట అనుకుంటూ అనుసరించాడు రామరాజు. అతడిలో ఆవేశం పొంగుతోంది. మాటిమాటి కీ పళ్ళు నూరుతున్నాడు. తన నడగొచ్చిన ఆ చచ్చిన కుర్రాడి తరపువాళ్ళైన మాల వాళ్ళందర్నీ నరికేయాలన్నంత కోపంగా వుంది. ఆ వెధవ ప్రాణానికి తనలాటి వాణ్ణి నిలదీస్తారా ?

మావగారింటి వీధిలో జనం వున్నారు గాని కేకల్లేవు. కర్రల్లేవు. ఏడ్పులు ....

రామరా జదిరిపోయాడు. తన భార్య పురుడుకని పదిరోజులక్రితం పుట్టింటి కొచ్చింది. ఆమెకి నొప్పులు కాదుకదా ? మరీజనం .... ?.

హాలులో ఆ కుర్రాడి.... బస్సుక్రింద పడి చనిపోయిన కుర్రాడి శవం ........ ప్రక్కన తన భార్య, అత్తగారు ఏడుస్తూ.... రామరాజు గుండెలు ఝల్లుమన్నాయ్.

"ఏమిటేవిటి? ఎవరు ? మన .... మన...."

"మన సూరపరాజే బావా" కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు పెద బావమరిది.

ఏడ్పులు మిన్నంటాయ్.

"ఆఁ .... మా సూరపరాజా ? మా సూరపరాజా ?....

"అవును బావా పిల్లలంతా అక్కడి బోదెలో చేపలు పడుతున్నార్ట. అంతలో మీ ఎర్ర బస్సు కన్పించడంతో మా నాన్నొంటాడంటూ పరుగెత్తుకొచ్చి ...."

"అయ్యో! నా కొడుకుమీద నా బస్సు అయ్యో భగవంతుడా! ఎంత ఘోరం చేశావు. అప్పుడే వాడికి నూరేళ్ళు నిండాయా? వాడి బంగారం లాంటి జీవితం మట్టిలో కలిపేశావా ? వాడిమీదెన్నో ఆశలు పెట్టుకున్నామే అన్నీ నాశనం చేసేశావా...."

కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు రామరాజు.

●